## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



రెంటచింతల: వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్‌గా, పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే మక్కెన శివతేజ(30) రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం ఎంతో బాధాకరమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం శివతేజ మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను కలిసి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు నగదు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శివతేజ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నవులూరు భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, మాజీ ఎంపీపీ సంపూర్ణమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఏరువ ప్రతాప్‌రెడ్డి, పేర్ల ముత్తయ్య, తుమ్మా ఇన్నారెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, దొడ్డా శౌర్రెడ్డి, పాతపాటి పిచ్చిరెడ్డి తదితరులున్నారు.

### పీఆర్కే నివాళి



మాచర్ల: ఒంగోలులో వైఎస్సార్ సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### డ్రగ్స్ వద్దు బ్రో..!



గురజాల: యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి, జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ ఆవుల భాస్కర్ సూచించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం పలు కళాశాలల్లో యువతకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. డ్రగ్స్ వాడటం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. డ్రగ్స్ వాడుటం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం కళాశాల ప్రాంగణాల్లో వాల్‌పోస్టర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.వినోద్ కుమార్ తదితరులున్నారు.

### 23న మెగా జాబ్ మేళా



పిడుగురాళ్ల: అర్వత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంళవారం పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ నందు జాబ్ మేళాకు సంబంధించి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ జాబ్ మేళాలో సుమారు 10 నుంచి 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి ఆపైన చదువుకున్న వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. వివేకానంద జరిగే మేళాకు హాజరు కావాలని, వివరాలకు 70752 36238 నంబరును సంప్రదించాలని తెలిపారు.

### స్త్రీనిధి రుణాలు నూరుశాతం చేయాలి

**రీకవరి అధికారి శ్రీరామ్**

నూజెండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్యా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్త్రీనిధి రీకవరి మేనేజరు పసుపులేటి శ్రీరామ్ పాల్గొని మాట్లాడుతూ నూజెండ్ల మండలంలో రూ. 20 లక్షలు మొండి బకాయిలు ఉన్నాయని ఈనెలఖారులోగా నూరుశాతం వసూలు చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు వసూలు చేస్తేనే తదుపరి ఇవ్వటానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు మంజూరు అవుతాయన్నారు. దీర్ఘకాలిక బకాయిలు చెల్లించటానికి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన విధివిధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్యా అధ్యక్షురాలు గుంటుపల్లి సుజాత, లిఖల్ కోఆర్డినేటరు ముండ్రు బ్రహ్మయ్య, సీసీలు కొండలు, సుబ్బారావు, రాజశేఖర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# పునరుజ్జీవానికి 'కూటమి' ఉరితాడు

- బడులకు ఊపిరిపోసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- మనబడి నాడు – నేడుతో పాఠశాలలకు మహర్దశ
- ఫేజ్–1 పూర్తి చేసి..ఫేజ్–2లో పనుల కొనసాగింపు
- కూటమి సర్కార్ రాకతో నిలిచిన అభివృద్ధి పనులు
- చివరిదశలో అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణం
- అందులోనే విద్యాబోధనతో నెట్టుకొస్తున్న వైనం



నెహ్రూ నగర్ ఎంపీపీ పాఠశాలలో నిర్మాణం నిలిచి పోయిన తరగతి గదులు

ప్రభుత్వ పాఠశాలల మహర్దశ అడుగు దూరంలో ఆగిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన మనబడి నాడు–నేడు అభివృద్ధి పనులు చివరి దశలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక సర్కారు పాఠశాలల ప్రగతి గాడి తప్పింది. గతంలో కార్పొరేట్ స్కూళ్లతో పోటీ పడిన పేదల బడులు.. ప్రస్తుతం 'ప్రైవేట్'కి ప్రోత్సాహం పెరిగి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. అసంపూర్తిగా మిగిలిన భవనాల్లో తరగతుల నిర్వహణే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం.

మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది బడుగు, బలహీన వర్గాల పేద పిల్లలకు ఉచితంగా ఇంగ్లీష్ విద్యను అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టింది. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అద్భుతమైన కృషితో సర్కారు బడులు రూపురేఖలు మారిపోయాయి. ఏళ్ల తరబడి శిథిలావస్థ భవనాల్లో నేలపైన సాగే చదువులకు స్వస్తి చెప్పారు. నాసిరకపు బ్లాక్ బోర్డు మీద చాక్‌పీస్ గీతల బోధనను డిజిటల్ బాట పట్టించారు. మనబడి నాడు– నేడు పేరుతో బృహత్తర మార్పులకు శ్రీకారం చుట్టారు. కోట్లాది రూపాయల నిధులతో కార్పొరేట్‌ను తలపించేలా పాఠశాలలను తీర్చిదిద్దారు. మొదటి విడతలో పనులు పూర్తి చేయడమే కాకుండా.. 2వ విడత కింద నాడు నేడు పాఠశాలలను ఎంపిక చేసి, నిధులను గత ప్రభుత్వ మంజూరు చేసింది. ఆ పనులు సాగుతుండగానే ఎన్నికలు వచ్చాయి.

**కొంచె స్పందిస్తే చాలు..**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేసింది. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తగ్గకుండా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది. మండలంలోని గన్నవరం, కంభంపాడు, రాయవరం, కొప్పునూరు, ద్వారకాపురి, తాళ్ల పల్లి తదితర పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి. చాలీ చాలనీ గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. చిన్న పాటి పనులైన కిటికీలు, తలుపులు, ఎలక్ట్రికల్, ఫ్లోరింగ్ లాంటి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావచ్చు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులను ప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తి భవనంలో విద్యా బోధన

**కూటమి రాకతో..**



తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ లేని తరగతి గదిలో విద్యా బోధన

గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు – నేడు అభివృద్ధి పనులపై కక్ష కట్టింది. 8 నెలల పాలనలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. మాచర్ల పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 తరగతి గదుల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. బాలికల పాఠశాలలో సుమారు 1000 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు గదులు లేక రేకుల షెడ్లలో, కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ లేని నిర్మాణం నిలిచిపోయిన గదుల్లో విద్యను కొనసాగిస్తున్నారు. అలాగే నెహ్రూ నగర్ వీరభద్రాపురం ఎంపీపీ స్కూల్‌లో 250 మంది విద్యార్థులు ఉండగా అందుకు సరిపడా గదులు లేక తీవ్ర ఇ బ్బందులు పడుతూ చెట్ల కింద, నిలిచి పోయిన గదుల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు తమ సొంత నగదు వెచ్చించి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



స్వామి అమ్మవార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రెంటచింతల: స్థానిక సుబ్బన్న తోటలోని అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థాన 21వ వార్షికోత్సవాలను మంగళవారం ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, పుష్పాభిషేకం, సహస్ర నామార్చన, సుదర్శనహోమం, ఎదురుకోలు ఉత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో స్వామి, అమ్మవార్లకు జంధ్యం, మంగళ సూత్రాలు, తలంబ్రాల బియ్యం తీసుకువచ్చారు. జిగురు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని పలువురు పుణ్య దంపతులు పీటలపై కూర్చుని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం వేలం పాటలో రెంటచింతల గ్రామానికి చెందిన గానుగపంట శ్రీనివాసరెడ్డి రూ.20 వేలకు శ్రీవారి లడ్డుతో పాటు బంగారు లాకెట్‌ను దక్కించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు మహాన్నదానం చేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్దబాబు, పాలక వర్గం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## తన్నీరు వెన్నెల ప్రతిభకు నగదు బహుమతి



తన్నీరు వెన్నెలను సత్కరిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల : వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ సందర్భంగా మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో తన్నీరు వెన్నెల శాస్త్రీయ నృత్యం అందరిని ఆకట్టుకుంది. తన్నీరు వెన్నలకు రూ. 5,500 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, రాష్ట్ర టీడీపీ నాయకులు, బీజేపీ నేతలు, కౌన్సిలర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. తన్నీరు వెన్నెల చదువుతోపాటు, పాటలు, నృత్యం సంగీతం, డ్రాయింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్ ప్లేయింగ్‌లో రాణించడం అభినందనీయని పలువురు కొనియాడారు. తల్లి డాక్టర్ సాంబేలు శాంతి బాయి శిక్షణలో తాను అన్ని నేర్చుకొంటున్నట్లు తెలిపింది. తండ్రి తన్నీరు నరసింహారావు, సోదరిణీలు తన్నీరు దీపిక, భవ్య, వరల్డ్ వెల్ బీయింగ్ ఫౌండేషన్ సభ్యులు, హ్యూమన్ రైట్స్ సభ్యులు చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు.

## నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ఎస్ఈ విజయకుమార్**



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ విజయకుమార్

దాచేపల్లి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎస్ఈ పి.విజయకుమార్ అన్నారు. మంగళవారం నడికుండి, తంగెడ, మాదినపాడు, పెదగార్లపాడు, శ్రీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌లను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడారు. ఎస్ఈ విజయకుమార్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వాడకం దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో విద్యుత్ అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేయాలని, విద్యుత్ లైనులకు తగులుతున్న చెట్లు తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఈ వెంట ఏఈ సింగయ్య, డెప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ వీరేశ్వరరావు, ఏఈలు భాగవాన్, నాగేశ్వరరావు ఉన్నారు.

## నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

మాచర్ల: మాచర్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డి.వేణుబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు పట్టణంలోని సెరీన్ కాలనీ, వడ్డెర బస్తీ, బ్యాంక్ కాలనీ (అంగన్‌వాడీ సెంటర్), సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆధార్ సంబంధిత సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

**రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు**

పిడుగురాళ్ల: పట్టణంలోని ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని చెరువు కట్ట బజారు, గాంధీ నగర్ సచివాలయాల్లో ఈ–ఆధార్ కేంద్రాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆధార్ అప్డేట్, నూతన ఆధార్, ఆధార్‌లోని తప్పు, ఒప్పులు సరిచేయడం, ఈకేవైసీ వంటి చేయనున్నట్లు తెలిపారు. రెండవ విడత ఇదే అధార్ కేంద్రాల్లో 25 నుంచి 28వ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ పేర్కొన్నారు.

**నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు**

వెల్దుర్తి: మండలంలోని ప్రత్యేక ఆధార్ క్యాంపులను బుధవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డుల్లో పేర్ల మార్పు, అడ్రస్సులు తప్పులుంటే సరిచేసుకోవాలని కోరారు. 19న వెల్దుర్తి, శిరిగిరిపాడు, 20న ఉప్పలపాడు, శిరిగిరిపాడు 1, 21, 22న పట్లవీడు, గంగలకుంట, 25 శ్రీరాంపురంతండ, గొట్టిపాళ్ళ, 26 రచ్చమల్లపాడు, మిట్టమీదిపల్లె, 27 బోదిలవీడు, కొత్తపుల్లారెడ్డి గూడెం, 28 కండ్లకుంట, గుండ్లపాడు సచివాలయాల్లో ఆధార్ కార్డు క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలల్లో మైకులు, డప్పుల ద్వారా సమాచారమందించాలన్నారు.

## ఘనంగా మహంకాళి అమ్మవారి తిరునాళ్ల



ప్రధాన కలశ ఆలయ ప్రవేశం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం 50వ తిరునాళ్ల మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, పూలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి స్నపనం, విశేష పూజలు అనంతరం ప్రత్యేక అలంకారం జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. ప్రధాన కలశ ఆలయ ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి జరిపి పూజ పండిత సత్కారాలు జరిపారు. శైవాగమ పండితులు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాము లు కొత్తలంక కార్తికేయశర్మ పూజాదికాలు నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు పట్టణం నుంచి బాలప్రభలు, మొక్కుబడి ప్రభలను ఆలయానికి తీసుకువచ్చారు. డీజెలు, డప్పు దరువులతో యువత సందడి చేశారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నప్రసాద వితరణ గావించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు ప్రత్యేక అధికారి, అసిస్టెంట్ కమీషనర్ జె.శ్రీనివాసరావు, ఈవో ఎస్.మాధవిదేవిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## మానసిక ధృడత్వంతోనే సమాజంలో రాణింపు



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ ఫణీందర్

నాదెండ్ల: ఆరోగ్య సమస్యల పట్ల విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే విద్యలో లక్ష్యాలు సాధించవచ్చని సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ సీహెచ్ ఫణీందర్ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం మెంటల్ హెల్త్ అండ్ కెరియర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. మానసికంగా ధృడంగా ఉంటేనే విద్యలో సమాజంలో రాణించగలరన్నారు. నేటి మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని, బాలికలు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి

**ద్వామా పీడీకి వ్యవసాయ కార్మిక సంఘం వినతి**



పీడీ లింగమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న పని ప్రదేశాలలో ఉపాధి కూలీలకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, అధికార యంత్రాంగం కూలీలకు కనీస వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతుందని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు విమర్శించారు. ఈ మేరకు పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం రామిరెడ్డిపేటలోని పీడీ కార్యాలయంలో ద్వామా పీడి సిద్ధలింగమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కూలీలకు పని ప్రదేశాలలో వసతులు కల్పించడం లేదన్నారు. దీనివలన వడదెబ్బకు గురై అస్వస్థకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కొద్ది రోజులలో కొత్త ఆర్థిక ఏడాది ప్రారంభం కావడం వ్యవసాయ పనులు ముగియడం తదితర కారణాలతో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, కూలీలు వలసలు నివారించేందుకు కొత్త పనులను గుర్తించాలన్నారు. ఉపాధి కూలీలు భోజనం చేయడానికి అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి గతంలో ప్రభుత్వం గుడారాలు, టెంట్లు పంపిణీ చేసే విధానానికి కొన్నేళ్లుగా స్వస్తి పలికారని వాటిని అందిస్తే కూలీలకు ఉపశమనం కలుగుతుందన్నారు. పని ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలు పనిచేసి నెలలు కావస్తున్న వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వేతనాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయాలకతీతంగా కూలీలకు పనులు చూపించాలని, దళిత గిరిజనులను అందరితో సమానంగా కాకుండా వేరుగా ఆలస్యంగా పనులు చూపడం జరుగుతుందని మొదటి ప్రాధాన్యత ఇచ్చి దళిత గిరిజనులకు ఉపాధి హామీ పనులు చూపించాలని కోరారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, నీడ కోసం కోసం టెంట్లు, పే స్లిప్పులు ఇవ్వాలని పనిదినాలు పెంచి వేసవి అలవెన్సులు పనిముట్లు ఇవ్వాలని కోరారు. ద్వామా పీడీ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య పాల్గొన్నారు.

### ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరబడుతున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి మే నెల 22 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో చేరేందుకు పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేయాలన్నారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150లు ఫీజు చెల్లించాలన్నారు.

### నిబంధనలు పాటించని వారిపై చర్య తీసుకోవాలి

చిలకలూరిపేట: నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ బి.రాంబాబునాయక్ కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ షేక్ మొహమ్మద్ హుస్సేన్, ఎంఈవో రత్నకళకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఒంటిపూట బడి విధానాన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అమలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. ఎండ తీవ్రతకు విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే సంబంధిత పాఠశాలలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

వినుకొండ: మచిలీపట్నంలో జరిగిన ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులో గల ఆక్స్‌ఫోర్డ్ స్కూల్ చదువుతున్న డి.శివనందన, ఎస్.సాయిభవాని ప్రథమ బహుమతి, ఎస్. సుజాత ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మి అభినందించారు. ఆడపిల్లలకు కరాటే నేర్చుకోవడం చాలా ముఖ్యమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షేక్ కాజా మొహిద్దీన్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నేడు తిరునాళ్ల

బొల్లాపల్లి : మండల కేంద్రంలోని వెంకట ఏకోనారాయణస్వామి తిరునాళ్ల బుధవారం జరగనుంది. తిరునాళ్లను పురస్కరించుకొని భక్తులు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటుకు సిద్ధమయ్యారు. స్వామివారి విగ్రహాన్ని గతంలో కొండ ప్రాంతంలో లభించడంతో అటవీ శాఖ అధికారులు, గ్రామపెద్దలు విగ్రహాన్ని రోడ్డుపై ప్రతిష్ఠించారు.

### రాయితీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మాచర్ల: బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు మంగళవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. 21 నుంచి 60 ఏళ్లలోపు ఉన్నవారు, తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. చిన్న, మధ్యతరహా యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నెలాఖరులోపు ఆస్తి పన్ను చెల్లించాలి

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలోని ఇళ్లు, షాపింగ్ మాల్స్, ఖాళీ స్థలాలకు ఈ నెల 31వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించాలని పురపాలక సంఘ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు మంగళవారం తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్ర వరకు పన్ను చెల్లించవచ్చని చెప్పారు. పట్టణంలో అధికారులు పర్యటిస్తున్నారని, నీరు, ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు. సమయానికి పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

మాచర్ల: పురపాలక సంఘ పరిధిలో కొన్నేళ్లుగా పని చేస్తున్న తమను అకారణంగా తొలగించడాన్ని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులు నిరసించారు. సీపీఎం, సీపీఐ నాయకులు పెద్ద పోగు బాబూరావు, ఎం.నాగేశ్వరరావు, పి.అబ్రహ్మం లింకన్ ఆధ్వర్యంలో పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి కారణాలు లేకుండా కార్మికులను తొలగించడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే ఉద్యోగాల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ డి.మరియబాబు, డేరంగుల శ్రీనివాసరావు, జి.సాంబశివరావు, గుండాల సైదులు పాల్గొన్నారు.

### ఈకేవైసీ తప్పనిసరి

గురజాల రూరల్ : రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ– కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ కె.నగేష్ సూచించారు. ఆయన పలు గ్రామాల్లో సోమవారం ఈ– కేవైసీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6,884 మంది రేషన్ కార్డులు ఉన్నప్పటికి వారు ఈ కేవైసీ చేయించుకోలేదన్నారు. ఈ కేవైసీ వీఆర్వో లేదా రేషన్ డీలర్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు.

### గృహ నిర్మాణాలకు అదనపు సాయం

వెల్దుర్తి: అర్ధంతరంగా నిర్మాణం నిలిచిన గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయమందిస్తోందని ఎంపీడీఓ ప్రసాద్ మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో గృహాలు మంజూరై వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ లబ్ధిదారులకు నాలుగు విడతల్లో అదనపు సాయమందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### హౌసింగ్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

రెంటచింతల: సొంత ఇళ్లు లేని, అర్హత ఉన్నవారు ఇళ్ల నిర్మాణం పథకం కింద ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ బాలాజీ నాయక్, ఏఈ సి. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అర్హులైన వారు 1.50 సెంట్ల సొంత స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్, భార్యభర్తల ఆధార్ కార్డుల జిరాక్స్, రేషన్ కార్డు, ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు, బ్యాంక్ ఖాతా నకళ్లు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో స్థానిక గ్రామ సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌ను కలిసి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ఎంపికైన లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలను విడతల వారీగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేసుకోవడానికి ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు అదనంగా ఇవ్వడం జరుగుతుందన్నారు.